క్లుప్తంగా

జాతీయ స్థాయి క్రీడాకారిణికి చేయూత



క్రీడాకారిణికి ఆర్థిక సాయం అందిస్తున్న దృశ్యం

ఎమ్మిగనూరుటౌన్: జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైన పట్టణానికి చెందిన విద్యార్థిని ఉమామహేశ్వరికి శనివారం స్థానిక మల్లెల గ్రూప్ సభ్యుడు మల్లెల జీవన్ ఆర్థిక సహాయం అందించారు. జాతీయ స్థాయి క్రీడల్లో పాల్గొనేందుకు వెళ్తున్న క్రీడాకారిణికి ట్రాక్ సూట్, షూ, స్టాకింగ్స్, గోల్‌కీపర్ గ్లౌజ్‌లు కొనుగోలు చేసేందుకు తమ వంతుగా సహాయం అందించారు. కార్యక్రమంలో పీఈటీలు రాము, వెంకటేష్, విద్యార్థిని తండ్రి శ్రీనివాసులు పాల్గొన్నారు.

వర్షం దెబ్బకు 30 గొర్రెలు మృతి



మృతి చెందిన గొర్రెలతో యజమానులు

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని సోగనూరు గ్రామంలో వర్షం దెబ్బకు శుక్రవారం రాత్రి 30 గొర్రెలు మృతి చెందాయి. గ్రామానికి చెందిన బోయ నరసప్ప, బోయ నాగేష్, బోయ దర్మపురం గిడ్డయ్యలకు చెందిన 30 గొర్రెలు వర్షానికి తట్టుకోలేక మృత్యువాతపడ్డాయి. శనివారం ఉదయం గొర్రెల యజమానులు గమనించి గుండెలు బాదుకున్నారు. ఒక్కొక్క గొర్రె రూ.10వేలకు పైగా ధర పలుకుతుందని తెలిపారు. ప్రభుత్వం ఆదుకోవాలని గొర్రెల యజమానులు కోరుతున్నారు.

గొర్రెల కాపరులను ఆదుకోవాలి

కౌతాళం: గొర్రెల కాపరులను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ గొర్రెల, మేకల పెంపకందారుల సంఘం జిల్లా అధ్యక్షుడు, గొర్రెల పెంపకందారుల సహకార సంఘం జిల్లా డైరెక్టర్ రాముడు డిమాండు చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ చిరుతపల్లి, మల్లనహట్టి గ్రామాల్లో అయ్యన్న, నాగరాజు, నర్సిములకు సంబంధించిన 30 గొర్రెలు అధిక వర్షాల వల్ల తడిసి అనారోగ్యానికి గురై చనిపోయాయని తెలిపారు. ప్రభుత్వం ఒక్కో గొర్రెకు రూ.10వేల చొప్పన పరిహారం ఇవ్వాలని డిమాండు చేశారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

ఆదోని అర్బన్: దొంగతనాలు జరగకుండా నిఘా ఉంచడానికి కాలనీలోని ప్రతిఒక్కరూ ఇంటి ముందు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని తాలూకా సీఐ నల్లప్ప సూచించారు. శనివారం పట్టణశివారులోని ఆస్పరి రోడ్డులో ఉన్న వైఎస్ఆర్ కాలనీలో చోరీల నివారణకు అప్రమత్తతపై తాలూకా సీఐ నల్లప్ప కాలనీవాసులకు అవగాహన కల్పించారు. ముఖ్యంగా ఇళ్లకు తాళాలు వేసి ఊళ్లకు వెళ్లే ప్రజలు తమ విలువైన సామగ్రిని ఇంట్లో ఉంచకుండా జాగ్రత్త పడాలని సూచించారు. అలాగే ఊళ్లకు వెళ్లే సమయంలో స్థానిక పోలీసులకు సమాచారం అందిస్తే.. పోలీసు నిఘా ఏర్పాటు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో తాలూకా స్టేషన్ సిబ్బంది, కాలనీవాసులు పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం



రోడ్డు పక్కకు ఒరిగిన ఆర్టీసీ బస్సు

కౌతాళం: ఆర్టీసీ బస్సుకు ప్రమాదం త్రుటిలో తప్పింది. ఆదోని నుంచి మండల పరిధిలోని రౌడూరుకు బస్సు వస్తుండగా గ్రామ సమీపంలోని వంక వద్ద కారుకు సైడ్ ఇవ్వబోయి ఒక్కసారిగా మట్టిలో దిగబడి పక్కకు ఒరిగిపోయింది. ఈ సమయంలో బస్సులో ప్రయాణికులు ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. కండెక్టరు, డ్రైవర్ మాత్రమే బస్సులు ఉన్నారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు జేసీబీ ద్వారా బస్సును బయటకు తీసే ప్రయత్నం చేయగా.. బస్సు ఇంకా ఒరగడంతో అలాగే వదిలేశారు.

గర్భిణుల సంరక్షణ కుటుంబసభ్యుల బాధ్యత



క్యాండిల్ ర్యాలీ ప్రారంభిస్తున్న సీడీపీవో సఫర్నీసాబేగం, సూపర్‌వైజర్లు

ఎమ్మిగనూరురూరల్: గర్భిణులను సంరక్షించుకోవాల్సిన బాధ్యత కుటుంబసభ్యులదేనని సీడీపీఓ సఫర్నీసాబేగం అన్నారు. శనివారం రాత్రి మండల పరిధిలోని గుడేకల్ గ్రామంలో 8వ రాష్ట్రీయ పోషణ్ కార్యక్రమంలో భాగంగా గర్భిణులు, బాలింతలు, మహిళలు, గ్రామస్తులకు అవగాహన కల్పించి క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సురేక, వయోలప్రీతి, సుచరిత, నాగలక్ష్మీ, సుదావతి, మమాదేవి తదితరులు పాల్గొన్నారు.









ఆదోని ఆర్టీసీ కాలనీలో వరదనీటి ప్రవాహం, ఎన్జీఓ కాలనీలో రోడ్డెక్కి పారుతున్న వంక, కౌడల్ పేటలో నీరు ఇలా.. అవుదూడవంక వద్ద సమీపం కాలనీని పరిశీలిస్తున్న పురపాలక చైర్‌పర్సన్ లోకేశ్వరి



ఎన్జీవోస్ కాలనీలో రోడ్డుపై ప్రవహిస్తున్న నీరు

వర్ష బీభత్సం

- ఆదోని డివిజన్‌లో 722.0 మిల్లీ మీటర్ల వర్షం
- ఆదోని పట్టణంలో 115 ఎం.ఎం.గా నమోదు
- పట్టణం అతలాకుతలం
- జలమయమైన లోతట్టు ప్రాంతాలు

ఆదోని టౌన్/ ఆదోని సెంట్రల్: బంగాళఖాతంలో ఎర్పడిన అల్పపీడనం వలన ఆదోని డివిజన్ ప్రాంతంలో గత రెండు రోజులుగా భరీ వర్షాలు కురుస్తున్నాయి. శుక్రవారం రాత్రి నుంచి శనివారం ఉదయం వరకు ఏకదాటిగా కురిసిన వర్షాలకు ప్రధాన రహదారులతో పాటు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వాగులు వంకలు పొంగిపొర్లుతున్నాయి.

ఆదోని అతలాకుతలం

పట్టణంలో గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు ఆదోని పట్టణం అతలాకుతలమయ్యింది. వర్షపాతం 115 ఎం.ఎం.గా నమోదయ్యింది. చెరువులు, కుంటలు నిండిపోయాయి. ఆదోని పట్టణానికి తాగునీటిని అందించే రాంజల నల్లచెరువు నిండుకుండలా దర్శనమిస్తోంది. రాంజల నల్లచెరువు గట్టుపై ఎక్కి నీరు ప్రవహిస్తున్నాయి. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఎల్ఐజీ, ఎంఐజీ, ఎన్‌జీవోస్ కాలనీ, మహాయోగిలక్ష్మమ్మవ్వ నగర్, ఎరుకల కాలనీ తదితర ప్రాంతాల్లో నీరు కాలువల్లో పొంగి ప్రవహిస్తున్నాయి. దీంతో ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బందికరంగా మారింది. ఆర్ట్స్ కళాశాల రోడ్డులో వాహనాల రాకపోకలకు ప్రజల ఇబ్బందులు వర్ణణాతీతంగా మారాయి. లోతట్టు ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కౌడల్‌పేట, హవన్నపేట, తిక్కస్వామిదర్గా, రిలయన్స్‌ట్రెండ్స్ ప్రాంతం, అరుంజ్యోతినగర్ తదితర ప్రాంతాల్లో ట్రాఫిక్ జాం అయ్యింది. రాకపోకలకు తీవ్ర ఇబ్బందికరంగా మారింది. ఆర్టీసీ కాలనీలో మండిగిరి ఎర్రవంక వాగు ఏడు అడుగులకు పైగానే ప్రవహించింది. దీంతో చుట్టుపక్కల ప్రాంతాల గుడిసెలు, మట్టి మిద్దెల్లో నివాసముండే ప్రజల ఇళ్లల్లోకి నీరు చేరడంతో ఇబ్బందులు పడ్డారు. బావాజీ నగర్, టెలికం కాలనీలతో పాటు కౌడల్‌పేట, గణేష్ సర్కిల్, చాకలిగేరి, బావాజీ నగర్ ఆవుదూడవంక, శంకర్‌నగర్, ఇందిరానగర్ వంటి పలు శివారు కాలనీలలో వర్షపు నీళ్లు మోకాళ్లలోతూ ప్రవహించాయి. ఇళ్లలోకి నీరు చేరడంతో తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.



జోహరాపురంలో వర్షానికి పొలంలోనే వదిలేసిన ఉల్లి పంట

వర్షం కురిసింది ఇలా ..

ఆదోని డివిజన్‌లో అత్యధికంగా ఆదోని మండలంలో 126.2 మిల్లీ మీటర్లు వర్షం కురువగా అత్యల్పంగా హోళగుంద మండలంలో 43.4 మిల్లీ మీటర్లు వర్షం కురిసింది. మంత్రాలయం మండలంలో 99.4 మిల్లీ మీటర్లు, ఎమ్మిగనూరు మండలంలో 88.0 మిల్లీ మీటర్లు, నందవరం మండలంలో 85.6 మిల్లీ మీటర్లు, గోనెగొండ్ల మండలంలో 89.6 మిల్లీ మీటర్లు, పెద్దకడబూరు మండలంలో 76.4 మిల్లీ మీటర్లు, కౌతాళం మండలంలో 66.2 మిల్లీ మీటర్లు, కోసిగి మండలంలో 50.2 మిల్లీ మీటర్లు వర్షం కురిసింది. డివిజన్లో మొత్తం 722.0 మిల్లీ మీటర్ల వర్షం కురిసినట్లు అధికారులు తెలిపారు.

లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



వరదనీటిలో పర్యటిస్తున్న సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ్

ఆదోని రూరల్: లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆదోని సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ్ ప్రజలకు సూచించారు. శుక్రవారం రాత్రి కురిసిన వర్షానికి నీట మునిగిన లోతట్టు ప్రాంతాలు ఎన్‌జీవో, హౌసింగ్ బోర్డు కాలనీల్లో పర్యటించి ప్రజలను అప్రమత్తం చేశారు. సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ వర్షాలకు భారీగా వరదనీరు లోతట్టు ప్రాంతాల్లోకి వచ్చే అవకాశం ఉందన్నారు. ప్రజలు కూలేందుకు సిద్ధంగా ఉన్న ఇళ్లల్లో ఉండరాదన్నారు. ప్రజలకు పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేస్తామన్నారు. ప్రజలకు అందుబాటులో అన్నిశాఖల అధికారులు ఉంటారని, ఏదైనా సమస్య తలెత్తితే వెంటనే వారికి సమాచారం అందించాలన్నారు. ఈయన వెంట మున్సిపల్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

ముంచెత్తిన వాన

మంత్రాలయం రూరల్ : రెండు రోజులుగా కురుస్తున్న ఎడతెరిపి లేని వానలు రైతన్నలను ముంచేశాయి. పంట పొలాలు నీటమునగడంతో రైతులు కంట నీరు పెడుతున్నారు. మంత్రాలయం మండలంలోని పరమాన్‌దొడ్డి తండాలో వరి పొలాలు, చెట్నిహళ్లి, మాధవరం, బూదూరు, వగరూరు, చిలకలడోణ గ్రామాల్లో పత్తి పొలాలు నీట మునిగాయి. వరదనీటితో తుంగభద్ర నది ఉధృతంగా ప్రవహిస్తోంది. స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో వంకను తలపించేలా వర్షపు నీటి దర్శనమిచ్చింది. కాగా, రైతులను ఆదుకోవాలని సీపీఐ నియోజక వర్గ కార్యదర్శి భాస్కర్ యాదవ్. తహసీల్దార్ రమాదేవికి వినతి అందజేశారు.

వాగులో కొట్టుకుపోయిన బైక్, ట్రాక్టర్

మండల పరిధిలోని మాలపల్లి – కంబలదిన్నె గ్రామాల మధ్య ప్రధాన రహదారిపై మాలపల్లి పెద్ద వంక ఉప్పొంగింది. శనివారం ఇద్దరు ప్రయాణికులు ఎమ్మిగనూరు వైపు వెళ్తుండగా వంతెన వద్ద వరద ప్రవాహం అధికంగా ఉండడంతో బైక్ వంకలోకి కొట్టుకుపోయింది. స్థానికులు గమనించి ఇద్దరు వ్యక్తులను రక్షించారు. అలాగే బేతంచర్ల చెందిన నాపరాళ్ల ట్రాక్టర్ మాలపల్లి మీదుగా ఎమ్మిగనూరు వెళ్తుడంగా వంతెనపై వరద ఉధృతికి వాగులో కొట్టుకుపోయింది. వాగులో ట్రాక్టర్ ఇంజిన్ భాగం ఇరుక్కు పోవడంతో స్థానికులు జేసీబీ సాయంతో బయటకు తీశారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ రమాదేవి, సీఐ రామాంజులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

కౌతాళం: వర్షాలకు కౌతాళం వంకతో పాటు కుంబళనూరు వంక వద్ద, బాపురం వంక వద్ద బ్రిడ్జిలపై రెండు అడుగుల వరకు నీరు చేరడంతో వాహనాలు తిరగలేని పరిస్థితి ఏర్పడింది. పది గంటల తర్వాత నీటి ఉధృతి తగ్గడంతో ప్రయాణం సాగింది. అలాగే చాలా వరకు పంటలు నీట మునిగాయి. రౌడూరు వంక వద్ద కూడా ఇలాంటి పరిస్థితే ఏర్పడింది. ఇక మండలంలోని నదిచాగి నుంచి కర్ణాటకకు వెళ్లే రహదారిలో ప్రధానంగా ఉన్న చెల్లె కూడ్లురు వంక బ్రిడ్జి కొట్టుకొని పోవడంతో రాకపోకలు పూర్తిగా స్తంభించాయి. అధిక వర్షాల వల్ల తేమ శాతం పెరగడంతో భూమిలో నుంచే నీటి ఊట వస్తోంది. కౌతాళంలోని పోస్టాఫీసులో అడుగు లోతు నీరు చేరాయి. ఇక పంట పొలాలు పూర్తిగా నీటమునిగాయి. వర్షం ఎడతేరిపి లేకుండా కురుస్తుండడంతో పంటలు తమ కళ్లముందే కుళ్లిపోతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.



చెట్నిహాళిల్లో పత్తి పైరులో వాన నీరు

దెబ్బతిన్న పంటలు

కోసిగి: ఏకదాటి వర్షానికి కోసిగి రైల్వే గేటు సమీపంలో చాప వాగు ఉధృతంగా ప్రవహించడంతో రాకపోకలు తీవ్రంగా ఆటంకం ఏర్పడింది. వాగు ఉధృతి తగ్గిన తర్వాత వాహనాలు నెమ్మదిగా ఇతరుల సహాయంలో వాగును దాటి ప్రయత్నం చేశారు. మరికొన్ని వాహనాలు మధ్యలో నిలిచిపోయి ఇబ్బందులు పడ్డారు. పంటపొలాలు సైతం పూర్తిగా దెబ్బతిన్నాయి. పత్తి పొలాలలో వర్షపు నీళ్లు నిలిచి పోయి కాయలన్నీ కుళ్లిపోయాయని రైతులు ఆవేన వ్యక్తం చేశారు. కొందురు రైతులు కాపు కోసి పొలాల్లో ఆరుబెట్టిన ఉల్లి తడిపోయాయి. కోసిగి, దుద్ది తదితర గ్రామాల్లో వ్యవసాయాధికారి పంటలను పరిశీలించి తగిన సూచనలు సలహాలు ఇచ్చారు.



వర్షానికి తడిచిన ఉల్లిని ఆరబెడుతున్న రైతులు



గంజిహళ్ల వద్ద పొంగి ప్రవహిస్తున్న మల్లెల వాగు

రోడ్డు పై నిలిచిన వర్షపు నీరు తొలగింపు

రెండురోజులుగా కురుస్తున్న వర్షాలకు మండల కేంద్రంలోని రంగప్పగట్టు వద్ద చింతకుంట, పల్లెపాడు గ్రామాలకు వెళ్లే రోడ్డులో వర్షపు నీళ్లు నిలిచిపోయి రాకపోకలు బంద్ అయ్యాయి. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు శనివారం ఎంపీపీ ఈరన్న, ఎంపీడీఓ ఈశ్వరయ్య అక్కడికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. అప్పటికప్పుడు జేసీబీ ఏర్పాటు చేసి నీటిని భూగేరువులో వెళ్లే విధంగా చర్యలు తీసుకున్నారు. దీంతో రోడ్డుపై నిలిచిన వర్షపు తగ్గిపోవడంతో యథావిధిగా వాహనాల రాకపోకలు కొనసాగాయి. వైఎస్సార్ సీపీ నాయకులు బుళ్లి నరసింహులు, నేలకోసిగి లక్ష్మన్న, కాంట్రాక్టర్ నాగరాజు, వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దంచికొడుతున్న వానలు

నందవరం : అల్పపీడనంతో మండలంలో రెండు రోజు పాటు మెస్తారుగా వానలు కురిశాయి. దీంతో వాగులు, వంకలు పొంగి పొర్లాయి. పంట పొల్లాల్లో వాన నీటితో నిండిపోయాయి. మండల పరిధిలోని పెద్దకొత్తిలి గ్రామంలోని వంక నిండి వంతెనపై వరద నీరు ఉధృతంగా ప్రవహించడంతో మంత్రాలయం మీదుగా వెళ్లి వాహనాలకు కొద్ది పాటు అంతరాయం ఏర్పడింది. అలాగే మిట్టసోమపురం గ్రామ సమీపంలో వంక ఉధృతంగా ప్రవహించడంతో వంతెనపై రాకపోకలు స్తంభించాయి. అలాగే గతంలో కురిసిన వర్షాలకే పత్తి, ఉల్లి పంటలు దెబ్బతిన్నాయి. ఈ వానకు చేతికి వచ్చిన పత్తి రాలిపోయిందని, తడిసి పోయిందని రైతులు ఆందోళన చెందుతున్నారు. చేతికి వచ్చిన పంటలు ఈ అకాల వర్షాలకు పూర్తిగా నాశనమయిందని, పెట్టుబడులకు కూడా రావడం లేదని అన్నదాతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం పంట నష్ట పరిహారం మంజూరు చేయాలని రైతులు కోరుతున్నారు.

నిలిచిన రాకపోకలు

గోనెగండ్ల: మండలంలోని గత రెండు రోజులుగా ఎడతెరపిలేని వర్షాలు కురుస్తున్నాయి. శుక్రవారం కురిసిన వర్షాలకు వాగులు వంకలు పొంగి పొర్లుతున్నాయి. దీంతో మండలంలో 83.6మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు అయినట్లు అధికారులు తెలిపారు. హంద్రీనది పరివాహక ప్రాంతాలు ఆలూరు, ఆస్పరి, ఆదోని తదితర ప్రాంతాల్లో వర్షాలు కురువడంతో అగ్రహారం, గంజిహళ్లి మల్లెల వంకకు పెద్ద ఎత్తున వరద నీరు వచ్చింది. దీంతో మల్లెల వాగు వంక ఒక్కసారిగా పొంగి పొర్లింది. దీంతో శనివారం గంజిహళ్లి నుంచి బైలుప్పల, అగ్రహారం గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. వరద నీరు ఉధృతి పెరగడంతో గంజిహళ్లిలో ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాల దగ్గరకు వరద నీరు వచ్చి చేరింది. వరద నీటి ప్రవాహంతో గంజిహళ్లిలో హంద్రీ పరివాహక ప్రాంతాల్లో వేసిన పత్తి, వేరుశగన, తదితర పంటలు నీటిలో మునిగిపోయాయి.



పరమాన్‌దొడ్డి తండాలో నీట మునిగిన పంటలు



కోసిగిలోని చాపవాగు వంకలో ఇరుక్కున్న ఆటోను ఒడ్డుకు చేర్చుతున్న ప్రజలు



వర్షపు నీటిని మళ్లిస్తున్న ఎంపీపీ ఈరన్న, ఎంపీడీఓ ఈశ్వరయ్య

లోతట్టుప్రాంతాల పరిశీలన

ఎమ్మిగనూరుటౌన్: వర్షాలకు పట్టణంలోని శివారు ప్రాంతాలతో పాటు లోతట్టు ప్రాంతాల్లోని వీధుల్లో వర్షపు నీరు నిలిచిపోయి ప్రజలు ఇబ్బందులు పడ్డారు. దీంతో శనివారం 18వ వార్డులోని ఆంజినేయ స్వామి గుడి ప్రాంతంలోని వీధులను మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి పరిశీలించారు.

అంతర్ కళాశాలల కబడ్డీ పోటీలు ప్రారంభం

ఆదోని సెంట్రల్: రాయలసీమ విశ్వవిద్యాలయం డిగ్రీ అంతర్ కళాశాలల కబడ్డీ పోటీలు శనివారం ప్రారంభమైయాయ్యయి. ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో జరుగుతున్న ఈ పోటీలను కళాశాల చైర్మెన్ విట్టా సతీష్ ప్రారంభించారు. ఏర్పాటు చేసిన సమావేశంలో కళాశాల కరస్పాండెంట్ దైవాదీనం రెడ్డి మాట్లాడుతూ కళాశాలలో రెండు రోజులు పాటు ఈ పోటీలు జరుగుతాయన్నారు. జిల్లా పరిధిలోని 13 డిగ్రీ కళాశాలల జట్లు ఈ పోటీలలో పాల్గొంటున్నట్లు తెలిపారు. తొలిరోజు రాయలసీమ విశ్వవిద్యాలయం జట్టు, ఆర్ట్స్ కళాశాల జట్టు పోటీ పడగా ఆర్ట్స్ కళాశాల జట్టు విజయం సాధించింది. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ మురళీమోహన్, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ చంద్ర శేఖర్, విశ్వవిద్యాలయం అసిస్టెంట్ డైరెక్టర్ అఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ శివకిశోర్, కళాశాల పీడీ ఎర్రిస్వామి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

గోనెగండ్ల : అల్పపీడనం ప్రభావంతో గత రెండు రోజులుగా మండలంలో విస్తారంగా వర్షాలు కురుస్తుండడంతో నది పరివాహక ప్రాంతాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ రాజేశ్వరి, ఎంపీడీఓ మణి మంజరి సూచించారు. శనివారం వారు మండలంలోని గంజిహళ్లి గ్రామాన్ని సందర్శించారు. హంద్రీనది సమీపంలోకి ఇళ్ల దగ్గరకు వచ్చిన వరద నీటి ప్రవాహన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్ఐ రామయ్య, ఈఓఆర్డీ అనంతసేన, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

గుంతలు పూడ్చండి

ఆదోని రూరల్: మాధవరం మెయిన్ రోడ్డు నుంచి కుప్పగల్ రైల్వేస్టేషన్ వరకు లింకు రోడ్డుకు పడ్డ గుంతలు పూడ్చాలని సీపీఎం మండల కార్యదర్శి కె.లింగన్న, కార్యదర్శివర్గ సభ్యులు జె.రామాంజనేయులు డిమాండ్ చేశారు. శనివారం వారు రహదారిలో పడిన గుంతలను పరిశీలించి మాట్లాడారు. మండలంలోని పాండవగల్లు పాత్రయ్య దేవాలయం వద్ద నుంచి పాండవగల్ మీదుగా కుప్పగల్ రైల్వేస్టేషన్ వరకు లింకు రోడ్డు కంకరతేలిపోయి గుంతలు పడి వాహనదారులు, ప్రజలు తిరగడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు.

పంట నష్టపరిహారం అందించాలి

ఆదోని రూరల్: గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల వల్ల దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం అందించాలని రైతుసంఘం మండల కమిటీ సభ్యుడు హనుమంతరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఆయన తన బృందంతో కలిసి పాండవగల్లు గ్రామంలోని పత్తి పొలాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మిర్చి, ఉల్లి, వేరుశనగ, ఆముదాలు, టమోటా తదితర పంటలు పూర్తిగా పాడైపోయాయన్నారు. కార్యక్రమంలో రైతులు అహ్మద్‌బాషా, ఉసేని, తాయన్న, ఈరన్న, మంగలి శివరాములు తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణల వల్లే ఇళ్లల్లోకి నీరు

ఆదోని రూరల్: ఆదోనిలో వాగులు, వంకలు, కుంటలను కొంతమంది ఆక్రమించుకోవడం వల్లే లోతట్టు ప్రాంతాల్లో ఇళ్లల్లోకి నీరు చేరుతున్నాయని సీపీఎం పట్టణ కార్యదర్శి లక్ష్మన్న, పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు గోపాల్, తిప్పన్న, నాయకులు వీరేష్, వెంకటేష్ ఆరోపించారు. శనివారం వారు కాలనీల్లో పర్యటించి వర్షాలకు ఇళ్లల్లోకి నీరు చేరిన కుటుంబాలను పరామర్శించారు. అధికారులు వెంటనే స్పందించి బాధిత కుటుంబాలకు నిత్యావసర సరుకులు ఉచితంగా పంపిణీ చేయాలని కోరారు.

ఉపాధి అవకాశాలపై అవగాహన

ఆదోని సెంట్రల్: విద్యతో పాటు ఉపాధి అవకాశాలపై కూడా అవగాహన కలిగి ఉండాలని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామచందర్ రెడ్డి తెలిపారు. శనివారం విద్యార్థులు ప్రాక్టికల్ అనుభవం నేర్పించే దిశగా బ్యాంకులు, పోస్టాఫీసులు, మీ సేవా సెంటర్లు, ఎలిక్ట్రికల్, మెకానికల్ వంటి సర్వీస్ సెంటర్‌లకు 10వ తరగతి విద్యార్థులను తీసుకెళ్లి అవగాహన కల్పించారు.

ఘనంగా జాషువా జయంతి

ఆదోని సెంట్రల్: పురపాలక ఉన్నత పాఠశాలలో గుర్రం జాషువా జయంతిని శనివారం ఘనంగా జరుపుకున్నారు. ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అరసం జిల్లా అధ్యక్షుడు ప్రహ్లాద్, ఉపాధ్యక్షుడు మల్లికార్జున, ఎస్టీయూ నాయకులు రమేష్ నాయుడు, సుంకన్న తదితరులు పాల్గొన్నారు.

జీడీపీ నీటిలో మునిగిన పంటలు

గోనెగండ్ల : గాజులదిన్నె ప్రాజెక్టుకు భారీస్థాయిలో వరద నీరు వచ్చి చేరింది. దీంతో జీడీపీ అధికారులు అప్రమత్తమై రెండు క్రస్ట్ గేట్లను ఎత్తి 18 వేల క్యూసెక్కుల నీటిని హంద్రీనదిలోకి విడుదల చేశారు. దీంతో హంద్రీ నది పరివాహక ప్రాంతాల్లో సాగుచేసిన పంటలు వరద నీటిలో మునిగిపోయాయి. వరద నీటి ప్రవాహంతో బి. అగ్రహారం, బైలుప్పల, గంజిహళ్లి, ఐరన్‌బండ తదితర గ్రామాల్లో దాదాపు 500 ఎకరాల్లో పంటలు మునిగిపోయాయి. ఈ గ్రామాల్లో రైతులు ఉల్లి, పత్తి, వేరుశనగ, కంది పంటలను సాగుచేశారు. హంద్రీనది నీటిలో మునిగిన పంటల నివేదికలను తయారు చేసి ఉన్నతాధికారులను పంపనున్నట్లు తహసీల్దార్ రాజేశ్వరి తెలిపారు.

నష్ట పరిహారం చెల్లించాలి

గాజులదిన్నె ప్రాజెక్టు గేట్లు ఎత్తి నీటిని హంద్రీనదికి విడుదల చేయడంతో నది పరివాహక ప్రాంతాల్లో సాగుచేసిన పంటలు నీటిలో ముగిపోయాయని, నష్టపోయిన ప్రతి రైతుకు ప్రభుత్వం పరిహారం చెల్లించాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కేవీ కృష్ణారెడ్డి కోరారు. శనివారం ఆయన పార్టీ నాయకులతో కలిసి వేముగోడులో నీటి మునిగిన పంటలను పరిశీలించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఉరుకుంద రెడ్డి, రవి రెడ్డి, నరేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నీట మునిగిన పంటలను పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కేవీ కృష్ణారెడ్డి


వరద బాధితులకు అన్నదానం

ఆదోని అర్బన్: రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షానికి ఆదోని పట్టణంలోని పలు కాలనీల్లో ఇళ్లల్లోకి నీరు చేరుకుని ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. స్థానిక డీఎస్పీ బంగ్లా సమీపంలో ఉన్న 25వ వార్డులోని కాలనీలో ప్రముఖ పారిశ్రామికవేత్త విట్టా రమేష్ వరద బాధితులకు శనివారం మూడు పూటలా అన్నదానం పెట్టించారు. మీంటూ అగర్వాల్, సేవకుడు శ్రీనివాస ఆచారి తదితరులు పాల్గొన్నారు.



అన్నదానం చేస్తున్న విట్టా రమేష్

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి



ఎస్సీ కాలనీ వాసులతో మాట్లాడుతున్న డీఎల్‌పీఓ

గోనెగండ్ల : పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం మనందరి బాధ్యత అని డీఎల్‌పీఓ తిమ్మక్క అన్నారు. శనివారం మండల కేంద్రం గోనెగండ్లలో పంచాయతీ అధికారులతో కలిసి ఆమె పర్యటించారు. గోనెగండ్ల ఎస్సీ కాలనీలో శుక్రవారం డెంగీ వ్యాధితో రెండేళ్ల బాలుడు మృతిచెందాడు. విషయం తెలుసుకున్న డీఎల్‌పీఓ ఎస్సీ కాలనీలో బాలుడి ఇంటిని సందర్శించి బాలుడి తల్లిదండ్రులతో పాటు కాలనీ వాసులతో మాట్లాడారు. దోమల నివారణకు పంచాయతీ అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని సూచించారు. ఈఓఆర్డీ అనంతసేన, పంచాయతీ ఈఓ సతీష్, సర్పంచ్ హైమవతి, సిబ్బంది పాల్గొన్నారు.

వివిధ అలంకరణల్లో అమ్మవార్లు

ఆదోని అర్బన్: శరన్నవ రాత్రోత్సవాల్లో భాగంగా ఆరో రోజు శనివారం అమ్మవార్లు వివిధ అలంకరణల్లో భక్తులకు దర్శనమిచ్చారు. కాత్యాయనీదేవి అలంకారంలో ఫారెస్ట్‌లైన్ అంబాభవానీమాత, అద్దాల అలంకారంలో ఆదోని ఇలవేల్పు శ్రీ మహాయోగి లక్ష్మమ్మవ్వవారు, ధాన్యలక్ష్మి అలంకారంలో ఎమ్మిగనూరు రోడ్డులోని శ్రీ గంగాభవానీమాత, బాలాత్రిపురసుందరీ అలంకారంలో నగరేశ్వరస్వామి ఆలయంలో వెలిసిన శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరిదేవి, నవధాన్యాల అలంకరణలో శ్రీ పేటవీరభద్ర స్వామి, శైలపుత్రి అలంకారంలో ఎంఎం కాలనీలోని శ్రీ మాతా పరమేశ్వరిదేవి, మున్సిపల్ క్రీడా మైదానంలో ప్రత్యేక అలంకరణలో దుర్గామాత కొలువుదీరారు.

సంతానలక్ష్మి.. సౌభాగ్య ప్రదాయినీ

మంత్రాలయం : మంత్రాలయం గ్రామ దేవత మంచాలమ్మ సంతాన లక్ష్మిగా రూపంలో కనువిందు చేశారు. అలాగే ఆర్యవైశ్య సంఘం నేతృత్వంలో కొలువైన వాసవి మాత లలితా త్రిపుర దేవి అలంకరణలో రూపొందించారు.

కోసిగి: మండలంలోని కందుకూరు గ్రామంలో వెలసిన శాంభవి దేవి ఆలయంలో దేవి లలితా త్రిపుర సుందరీ దేవి అలంకరణలో దర్శనమిచ్చారు.

ఎమ్మిగనూరురూరల్: కలుగోట్ల గ్రామంలో దుర్గాదేవి దేవాలయంలో లలితాత్రిపుర సుందరి దేవిగా అమ్మవారిని అలంకరించారు.

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని వీవర్స్ కాలనీ మైదానంలో వివేకానంద సంస్థ సభ్యులు ఏర్పాటు చేసిన మండపంలో శ్రీలలితాదేవి, కన్యకాపరమేశ్వరి ఆలయం, గోనెగండ్ల రోడ్డులోని అంబాభావని ఆలయంతో పాటు పలు ఆలయాల్లో గౌరీమాత తదితర రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు.





అద్దాలఅలంకారంలో మహాయోగి లక్ష్మమ్మవ్వ సంతాన లక్ష్మిగా మంచాలమ్మ

గురజాల క్షేత్రంలో విశిష్ట పూజలు

నందవరం : విజయ దశమి ఉత్సవాలలో భాగంగా శనివారం గురజాల క్షేత్రంలో ఆది దంపతులు (రామలింగేశ్వర స్వామి, పార్వతీ దేవి)లకు విశిష్ట పూజలు గావించారు. అలాగే సోమలగూడూరు గ్రామంలో పెద్దమ్మ దేవికి భక్తులు లాలీతా దేవి అలంకరణ గావించారు.